ఇంటి అనుమతులు ఈజీ..

మంచిర్యాలలో టీఎస్‌బీపాస్ ద్వారా అనుమతులు పొంది నిర్మాణంలో ఉన్న భవనం

టీఎస్ బీపాస్ అమలుతో తప్పిన తిప్పలు

- దరఖాస్తు చేసుకున్న 21రోజుల్లోనే పర్మిషన్
- మంచిర్యాల మున్సిపాలిటీలో 1994 దరఖాస్తులు
- అనుమతులిచ్చినవి 1547.. తిరస్కరించినవి 365..
- అండర్ ప్రాసెస్‌లో 36.. మిగిలినవి సింగిల్ విండో విధానంలో..
- బల్దియాకు రూ. 11.73 కోట్ల ఆదాయం

మంచిర్యాల టౌన్, జూలై 3 : మున్సిపాలిటీల్లో భవన నిర్మాణ అనుమతులు తీసుకోవడం సులభతరమైంది. రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ బీపాస్(తెలంగాణ స్టేట్ బిల్డింగ్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికెషన్ సిస్టం)ను అమల్లోకి తీసుకురాగా, భవన నిర్మాణ అనుమతుల కోసం మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరగడం, అధికారులను ప్రసన్నం చేసుకోవడం, నెలల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేకుండా పోయింది. అనుమతుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే 21 రోజుల్లో అనుమతులు లభిస్తున్నాయి. నూతన మున్సిపల్ చట్టం 2019 ప్రకారం యజమాని ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేకుండా 21 రోజుల్లోనే భవన నిర్మాణ అనుమతులు వచ్చేలా రూపొందించిన ఈ టీఎస్‌బీపాస్ సిస్టంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. స్వీయ ధ్రువీకరణ ద్వారా ఆన్‌లైన్‌లోనే సంబంధిత పత్రాలను పొంది పరచాల్సి ఉంటుంది. tsbpass.telangana.govt.in వెబ్‌సైట్‌లో నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకుంటే స్థల విస్తీర్ణాన్ని బట్టి అందులోనే ఫీజులు నిర్ధారించి, అన్నీ సక్రమంగా ఉంటే 21 రోజుల్లోనే అనుమతులు లభిస్తున్నాయి. మంచిర్యాల మున్సిపాలిటీలో గడిచిన రెండున్నరేళ్లలో 1,994 మంది భవన నిర్మాణాల దరఖాస్తులు సమర్పించగా, అందులో 1,547 అర్జీలకు సంబంధించిన భవన నిర్మాణ అనుమతులు లభించాయి. వివిధ కారణాలతో 365 తిరస్కరించారు. 36 అండర్ ప్రాసెస్‌లో ఉన్నాయి. మిగిలినవి సింగిల్‌విండో విధానంలో దరఖాస్తు చేసుకున్నారు. కాగా.. భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి ఇప్పటివరకు మంచిర్యాల మున్సిపాలిటీకి రూ.11.73 కోట్ల ఆదాయం సమకూరింది. నాలుగు ప్రదేశాల్లో కలిపి 19 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన లే అవుట్‌లకు టెంటేటివ్ లేఅవుట్ అనుమతులు లభించాయి.

టీఎస్‌బీపాస్ ప్రత్యేకతలు

టీఎస్‌బీపాస్‌తో మున్సిపాలిటీల్లో భవన నిర్మాణాలకు అనుమతులు సులభంగా లభిస్తాయి. స్వీయ ధ్రువీకరణతో తక్షణ అనుమతులు రానున్నాయి. 75 చదరపు గజాల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్లాట్లలో నిర్మించే భవనాలు పూర్తయిన తర్వాత ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తీసుకోవాలి. సదరు యజమాని ఇచ్చే స్వీయ ధ్రువీకరణ ఆధారంగా ఈ సర్టిఫికెట్‌ను 15 రోజుల్లో జారీ చేస్తారు. నివాసేతర భవనాలకు కూడా ఆర్కిటెక్ట్‌తో అప్‌స్ట్రీ చేయించిన స్వీయ ధ్రువీకరణ ఆధారంగా 15 రోజుల్లో ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇస్తారు.

- 75 చదరపు గజాల లోపు స్థలంలో ఏడు మీటర్ల ఎత్తు వరకు నిర్మించే నివాస భవనాలకు అనుమతులు అవసరం లేదు. నామమాత్రంగా రూపాయి లెక్కింది భవన నిర్మాణ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందవచ్చు.
- 75 నుంచి 239 చదరపు గజాల విస్తీర్ణంలోని ప్లాట్లలో ఏడు మీటర్ల ఎత్తు (జీ ప్లస్ వన్) వరకు నిర్మించే నివాస భవనాలకు తక్షణ అనుమతి పొందే వీలుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగానే పర్మిషన్ వస్తుంది.
- 239 చదరపు గజాల నుంచి 598 చదరపు గజాల విస్తీర్ణంలోని ప్లాట్లలో పది మీటర్ల ఎత్తు (జీ ప్లస్ 2) వరకు నివాస భవన నిర్మాణాలకు స్వీయ ధ్రువీకరణ పత్రం ఆధారంగా అనుమతులు ఇస్తారు.
- 598 గజాలకన్నా ఎక్కువ విస్తీర్ణం, జీ ప్లస్ 2 కంటే ఎక్కువ అంతస్తులు ఉండే ప్లాట్లలో నివాసేతర భవనాలకు సింగిల్ విండో పద్ధతుల్లో అనుమతులు ఇస్తారు. ఎన్‌వోసీ కోసం ఇతర శాఖలను సంప్రదించాల్సిన అవసరం ఉండదు. దరఖాస్తులను పరిశీలించి 21 రోజుల్లో పర్మిషన్ ఇస్తారు. ఏదైనా కారణంతో గా గడువులోపు అనుమతులు రాకుంటే దరఖాస్తుదారుడు అనుమతి వచ్చినట్లుగానే భావించాల్సి ఉంటుంది. 22వ రోజు ఆన్‌లైన్‌లో అనుమతి పత్రం పొందవచ్చు.

నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా

టీఎస్‌బీపాస్ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకునేలా నిబంధనలు పొందుపరిచారు. స్వీయ ధ్రువీకరణలో ఇచ్చిన వివరాలు ప్రకారం భవనాన్ని నిర్మించకుంటే నిర్మాణ దారులు బఖ్బుందులు పడుతారు. అనుమతులు పొందిన భవనాల వివరాలను టీఎస్ బీపాస్ యాప్‌లో నమోదు చేస్తారు. వీటిని ఎప్పటికప్పుడు కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ కమిటీ పర్యవేక్షిస్తుంది. ఈ కమిటీ అనుమతులు తీసుకున్న ప్రకారం భవన నిర్మాణం జరిగిందా లేదా ఎమైనా తేడాలు ఉన్నాయా? ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు ఏమైనా జరిగాయా?అని పరిశీలిస్తారు. ఒకవేళ తేడాలు ఏమైనా ఉంటే.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరిగితే ఎలాంటి నోటీసులు లేకుండానే వాటిని కూల్చేసే అవకాశం ఉంటుంది. జరిమానా కూడా విధిస్తారు.

లేఅవుట్లకు అనుమతులు

స్వీయ ధ్రువీకరణ ఆధారంగా దరఖాస్తు చేసుకున్న డెవలపర్లకు తాత్కాలిక లేఅవుట్ ప్లాన్ అనుమతిని ఆన్‌లైన్‌లో 21 రోజుల్లో ఇస్తారు. లే అవుట్ పూర్తి చేసుకున్న తర్వాత లైసెన్స్ కలిగిన సాంకేతిక సిబ్బందితో అటెస్ట్ చేయించి జిల్లా కమిటీలు పరిశీలించాకే తుది అనుమతులు జారీ చేస్తారు. మున్సిపాలిటీకి తనాఖాగా పెట్టిన ప్లాట్లను తుది అనుమతులు వచ్చిన 21 రోజుల తర్వాత విడుదల చేస్తారు. అనుమతులు తీసుకోకుండా భూమిని అభివృద్ధి చేసిన డెవలపర్‌కి ఆ భూమి విలువలో 25 శాతం జరిమానా విధిస్తారు. అక్రమ లేఅవుట్ వివరాలను సబ్ రిజిస్ట్రార్‌కు సర్వేనంబర్ సహా నివేదికలను అందిస్తారు. దీంతో లేఅవుట్ లేని స్థలాలకు రిజిస్ట్రేషన్ చేయడం కుదరదు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ నిక్షిప్తం కావడంతో నిర్మాణాలకు అనుమతులు లభించవు.

సులభంగా అనుమతులు

టీఎస్‌బీపాస్ ద్వారా భవన నిర్మాణాలకు అనుమతులను సులభంగా పొందవచ్చు. తెలంగాణ ప్రభుత్వం భవన నిర్మాణాల అనుమతులు పారదర్శకంగా ఉండడానికి టీఎస్‌బీపాస్ విధానాన్ని తీసుకొచ్చింది. ఇంటి నుంచే దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందే వీలుంది. అయితే ప్రభుత్వం సూచించిన ప్రకారంగా నిబంధనలు పాటించాలి. తనిఖీ బృందాలు భవన నిర్మాణాన్ని పరిశీలిస్తాయి. ఆ సమయంలో డీవియేషన్లు ఉంటే ఇబ్బందులు ఎదురవుతాయి. అన్ని డాక్యుమెంట్లు, సర్టిఫికెట్లు పొందుపరిచితే భవన నిర్మాణాల అనుమతులు నిర్ణీత గడువులోగానే పొందగలుగుతారు. లేఅవుట్ అనుమతులు కూడా సులువుగా పొందే అవకాశం ఉంది. ప్లాట్లు కొనాలనుకునే వారు లేఅవుట్ అనుమతులు ఉన్న ప్లాట్లనే కొనుగోలు చేయాలి. లేకుంటే నిర్మాణ అనుమతుల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

- సత్యనారాయణ, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్, మంచిర్యాల

చెన్నూర్ : పోడు పట్టాల పంపిణీ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాల్కసుమన్

- రిజర్వేషన్‌ను పది శాతానికి పెంచిన ఘనత కేసీఆర్‌దే..
- ఎన్నికలప్పుడు వచ్చే వారి మాటలు నమ్మవద్దు
- దమ్ముంటే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రూ. 4 వేల పింఛన్ ఇవ్వాలి
- హక్కుల కోసం అడిగితే గుర్రాలతో తొక్కించిన చరిత్ర మీది కాదా?
- రేవంత్‌రెడ్డి చంద్రబాబు ఏజెంట్.. దొంగ
- అభివృద్ధి, సంక్షేమం ఇలాగే కొనసాగాలంటే మళ్లీ గెలిపించాలి
- ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్కసుమన్
- చెన్నూర్‌లో ఎంపీ వెంకటేశ్ నేతకాని, జడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మితో కలిసి పోడు పట్టాలు పంపిణీ

పోడు పట్టా అందుకున్న ఆనందంలో రైతులు

గిరిజనులకు స్వర్ణయుగం

సీఎం కేసీఆర్ పాలనలోనే అడవిబిడ్డలకు న్యాయం

చెన్నూర్, జూలై 3 : ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన గిరిజనులకు ఒక స్వర్ణయుగమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బాల్కసుమన్ పేర్కొన్నారు. సోమవారం చెన్నూర్ పట్టణంలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని 666 మంది గిరిజనులకు 1,190 ఎకరాలకు సంబంధించిన పోడు పట్టాలను పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేతకాని, జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మితో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ విప్ బాల్కసుమన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అడవిబిడ్డల అస్తిత్వాన్ని గుర్తించి, వారి అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ న్యాయం చేస్తున్నదని, వారిపై ప్రేమను, చిత్తశుద్ధిని చాటుకుంటుందన్నారు. గిరిజనులకు విద్య, ఉద్యోగావకాశాలను పెంచేందుకు రిజర్వేషన్ శాతాన్ని పదికి పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని కొనియాడారు. అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ పేరిట విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే పేద గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం రూ. 20 లక్షల సాయం అందజేస్తున్నదని చెప్పారు. రాష్ట్రంలో 500 జనాభా దాటిన 2,471 గిరిజన తండాలు, గూడేలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపామని.. బంజారాలు, ఆదివాసుల కోసం హైదరాబాద్ లో రూ. 50 కోట్లతో సంత్ సేవాలాల్ బంజారా భవన్, కుమ్రం భీం ఆదివాసీ భవనాన్ని నిర్మించనట్లు చెప్పుకొచ్చారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత సీఎం కేసీఆర్ గిరిజన సంక్షేమానికి రూ.53 వేల కోట్లు ఖర్చు చేశారని, గిరిజన గ్రామాల్లో రూ.248.20 కోట్లతో గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించారని తెలిపారు. రూ 1,275.87 కోట్లతో 1,682 గిరిజన ఆవాసాలకు బీటీ రోడ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రూ.121.80 కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా 58 గిరిజన భవనాలు నిర్మించిందన్నారు. 8,467 గిరిజన ప్రాంతాలకు రూ.221 కోట్లతో వ్యవసాయ విద్యుత్ సౌకర్యం కల్పించిందన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో పింఛన్ ఇవ్వడానికి అష్టకష్టాలు పడుతున్న హస్తం పార్టీ.. తెలంగాణలో అధికారంలోకి వస్తే రూ. 4 వేల పింఛన్ ఇస్తామంటే నమ్మే వారు లేరని ఎద్దేవా చేశారు. దమ్ముంటే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో మొదట రూ.4 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసులు, గిరిజనులు హక్కుల కోసం అడిగితే గుర్రాలతో తొక్కించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని గుర్తు చేశారు. 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్, బీజేపీలు పోడు పట్టాలు ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని ప్రశ్నించారు. రేవంతిరెడ్డి చంద్రబాబు ఏజెంట్ అని, తెలంగాణ ఉద్యమ సమయంలో చంద్రబాబు పక్కన ఉన్న దొంగ అని మండిపడ్డారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం ఇలాగే కొనసాగాలంటే అక్కడ కేసీఆర్, ఇక్కడ తనను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇంకా పోడు పట్టాలు రాని వారు ఉంటే సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

చెన్నూర్ : పోడు రైతుకు పట్టాను అందజేస్తున్న విప్ బాల్కసుమన్, ఎంపీ వెంకటేశ్ నేతకాని

గిరిజన సంక్షేమమే ధ్యేయం

- ఎంపీ వెంకటేశ్ నేతకాని

తెలంగాణ రాష్ట్రంలోని గిరిజనుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్‌నేకాని పేర్కొన్నారు. గిరిజనులు దశాబ్దాలుగా తమ హక్కుల కోసం అనేక ఉద్యమాలు చేసినా.. అప్పటి ప్రభుత్వాలు పట్టించుకోలేదని విమర్శించారు. సీఎం కేసీఆర్ చరిత్రలో నిలిచిపోయేలా గిరిజనులకు పోడు పట్టాలిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, అదనపు కలెక్టర్ రాహుల్, ట్రైనీ కలెక్టర్ గౌతమి, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెన్నూర్‌లో పోడు పట్టాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన రైతులు

పోడు పట్టాల పాసు బుక్కులతో మహిళా రైతులు

జైనూర్ : పోడు భూమి పట్టాలను అందజేస్తున్న ఆసిఫాబాద్ జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి

భీం స్ఫూర్తితోనే పోడు పట్టాల పంపిణీ

గిరిజనుల దశాబ్దాల కల నెరవేర్చిన ఘనత సీఎం కేసీఆర్‌దే..

- జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి
- పలుచోట్ల ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెలతో కలిసి పంపిణీ
- రెబ్బెనలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

వాంకిడి : పోడుభూముల పట్టాల కోసం వచ్చిన రైతులు

ఆసిఫాబాద్ టౌన్ : పట్టా పాస్‌బుక్కు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగేశ్వర్‌రావు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/వాంకిడి, జూలై 3 : కుమ్రం భీం స్ఫూర్తితోనే సీఎం కేసీఆర్ పోడు భూములకు పట్టాలు పంపిణీ చేశారని జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి పేర్కొన్నారు. సోమవారం వాంకిడి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జడ్పీటీసీ అజయ్‌కుమార్‌తో కలిసి ఆమె గిరిజన రైతులకు పోడు పట్టాలు పంపిణీ చేశారు. మొత్తం 1,035 మందికి పోడు పట్టాలు మంజూరైనట్లు పేర్కొన్నారు. సర్పంచ్ బండే తుకారాం, ఎంపీడీవో వేంకటేశ్వర్ రెడ్డి, ఏపీ మిలింద్ కుమార్, పీఏసీసీ చైర్మన్ జాబోరే పెంటు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, నాయకులు దీపక్, డీపీఎంసీ మెంబర్ ఎం.అశోక్ ఉన్నారు.

కెరమెరి, జూలై 3 : పోడు భూములు సాగు చేస్తున్న రైతులందరికీ పట్టాలిచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో1,204 మంది రైతులకు పోడు భూములు పట్టాలు అందించారు. వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న గిరిజన రైతుల కలను సీఎం కేసీఆర్ సాకారం చేశారన్నారు. పట్టాలు ఇవ్వడమేగాకుండా రైతుబంధు అందించడం గొప్ప విషయమని కొనియాడారు. ఎంపీపీ పెందోర్ మోతీరాం, జడ్పీటీసీ దుర్పతాబాయి, వైస్ ఎంపీపీ సయ్యద్ అబూల్ కలాం, ఎంపీడీవో సత్యనారాయణ గౌడ్, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు కుమ్రం నాణేశ్వర్, సూపరింటెండెంట్ సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ రామ కిష్ణప్రసాద్, రైతు బంధు సమితి మండలాధ్యక్షుడు కేంద్రె బాలాజీ, ఎంపీటీసీ ఇష్టేకర్, సిడాం భీంబాయి, సర్పంచులతో పాటు నాయకులు మడవి రఘునాథ్, దండురామ్, భీంరావ్, బొజ్జిరావ్, రైతులు పాల్గొన్నారు.

జైనూర్, జూలై 3 : జైనూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన సభలో 892 మంది గిరిజన రైతులకు జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి పోడు పట్టాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ జల్, జంగిల్, జమీన్ కోసం పోరాటం చేసిన కుమ్రం భీం పోరు గడ్డ ఆసిఫాబాద్ నుంచే పోడు పట్టాల పంపిణీ ప్రారంభించిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. నాడు ఇంద్రవెల్లి అమరుల స్తూపం వద్ద నివాళులర్పించేందుకు వెళ్లిన వారిపై కాంగ్రెస్ ప్రభుత్వం లాఠీచార్జి ఘటనను ప్రజలు ఇప్పటికీ గుర్తుంచుకున్నారని, ఆ పార్టీకి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనకయాదవరావు, ఎంపీపీ కుంర తిరుమల విశ్వనాథ్, వైస్ ఎంపీపీ టీర్లె లక్ష్మణ్, సహకార సంఘం చైర్మన్ హన్నుపటేల్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాలా, మడావి భీంరావ్, మెస్రం రాహుల్, ఎంపీటీసీలు కుంర భగవంత్‌రావ్, ఆత్రం జుగాదిరావ్, నాయకులు మెస్రం అంబాజీరావ్ ఉన్నారు.

ఆసిఫాబాద్ టౌన్, జూలై 3 : జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి అరిగెల నాగేశ్వర్ రావుతో కలిసి పోడు రైతులకు పట్టాలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లికార్జున్ యాదవ్, ఎంపీపీ ప్రసాద్, సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ హమ్మద్ ఉన్నారు.

రెబ్బెన, జూలై 3 : పోడు పట్టాల పంపిణీ సందర్భంగా రెబ్బెన మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి రైతులు పాలాభిషేకం చేశారు. ఎంపీపీ సౌందర్య, జడ్పీటీసీ సంతోశ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

రెబ్బెన : సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎంపీపీ సౌందర్య, జడ్పీటీసీ సంతోశ్, పోడు రైతులు